



నగరంలోని పెద్దమ్మ గుడివద్ద టెంకాయలు కొడుతున్న రుద్రంపేట ఉప సర్పంచ్ నరేంద్ర రెడ్డి

పెద్దమ్మ తల్లికి నూటొక్క టెంకాయ

అనంత ఓటమితో మొక్కు తీర్చుకున్న వైసీపీ ఉప సర్పంచ్

అనంతపురం రూరల్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో అనంతపురం అర్బన్ వైసీపీ అభ్యర్థి, తాజా మాజీ ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి ఓడిపోయారు. దీంతో అదే పార్టీకి చెందిన రుద్రంపేట ఉప సర్పంచు నరేంద్రరెడ్డి పెద్దమ్మ తల్లికి శుక్రవారం 101 టెంకాలు కొట్టి మొక్కు చెల్లించుకున్నారు. అనంతపురం నగరంలోని జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయం సమీపంలో ఉన్న ఆలయం వద్ద ఆయన టెంకాయలు కొట్టడం వైసీపీపై సొంత పార్టీ నేతల్లో ఉన్న అసంతృప్తికి అద్దం పట్టింది. అనంత వెంకటరామిరెడ్డి ఓడిపోవాలని తాను పెద్దమ్మ తల్లికి మొక్కుకున్నాననీ, ఆయన ఓటమితో అమ్మవారికి మొక్కు చెల్లించానని నరేంద్ర రెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో అనంత వెంకటరామిరెడ్డి కోసం పనిచేసిన నరేంద్ర రెడ్డి.. పార్టీ అధికారంలోకి వచ్చాక ఆయనతో విభేదించారు. బహిరంగ విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో అనంతను ఓడించాలని పిలుపునిచ్చారు. పార్టీ కార్యక్రమాలకు కూడా మొక్కుబడిగా వెళ్లేవారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం టౌన్, జూన్ 7: వర్షాల కారణంగా దోమలు ప్రబలుతాయని, వ్యాధులు పొంచి ఉంటాయని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి అన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధుల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో జిల్లాస్థాయి ప్రణాళిక కమిటీ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులకు డీఎంహెచ్ఓ పలు సూచనలు చేశారు. సీజనల్ వ్యాధులు పెరగడానికి దోమలు ప్రధాన కారణమని అన్నారు. వర్షాలు కురుస్తున్నందున దోమలు బెడద పెరుగుతుందని, జ్వరాలు, ఇతర వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని అన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓడాక్టర్ ఈబీ దేవి

సమస్య ఉన్న ప్రాంతాలను గుర్తించి, ముందుగానే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలని వైద్యశాఖ అధికారులకు సూచించారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను గుర్తించి, శుభ్రం చేయించాలని సూచించారు. దోమల నివారణకు మలాథియన్ స్ప్రే చేయించాలని అన్నారు. జ్వర పీడితులను గుర్తించి, వారికి మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించాలని, పాజిటివ్ ఉన్నవారికి అవసరమైన చికిత్సలు అందేలా చూడాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన పెంచాలని, జాగ్రత్తలు పాటించేలా చూడాలని అన్నారు. సమావేశంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ రవికుమార్, జీజీహెచ్ సీనియర్ వైద్యులు డాక్టర్ భీమసేనాచారి, డీఎంఓ డాక్టర్ ఓబులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, డాక్టర్ రవిశంకర్, డెమోలు ఉమాపతి, త్యాగరాజు, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

జల సంజీవని.. హంద్రీనీవా..!

ఐదేళ్లుగా అటకెక్కిన పథకం



చుక్క నీటికి తల్లడిల్లిన ఉమ్మడి జిల్లాను హంద్రీనీవా సుజల స్రవంతి పథకం సంజీవనిగా నిలిచింది. ఇప్పటికైతే తాగునీటి కొరతను కొంతమేర తీర్చగలిగింది. చెరువులను తడి చేయగలిగింది. కానీ పథకం ఉద్దేశం దశాబ్దాలుగా నెరవేరడం లేదు. శ్రీశైలం జలాశయం వెనుక జలాలను ఎత్తిపోసుకునే ఈ పథకానికి 42 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. ఇందులో సింహభాగం ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందాలి. ఇక్కడ 30 టీఎంసీలను వాడుకునేందుకు వెసులుబాటు ఉంది. జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులను నింపి.. కాలువలకు నీరు ఇవ్వడం ద్వారా 3.45 లక్షల హెక్టార్లను సస్యశ్యామలం చేయొచ్చు. లక్షలాది మంది తాగునీటి సమస్యను పరిష్కరించవచ్చు. కానీ పనులు సకాలంలో పూర్తి కావడం లేదు. కొత్త రిజర్వాయర్ల నిర్మాణం అటకెక్కడం, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ ఏర్పాటు కాకపోవడంతో కృష్ణా జలాలను సాగుకు వినియోగించలేకున్నారు. హంద్రీనీవా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. మడకశిర బైపాస్ కెనాల్, శ్రీసత్యసాయి జిల్లాలో 195 మైనర్ ఇరిగేషన్ చెరువులకు గ్రావిటీ ద్వారా నీరు అందించే పథకం, గుంతకల్లు నియోజకవర్గంలో 12 చెరువులకు నీరిచ్చే పనులను పక్కన పడేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో 50 వేల ఎకరాలకు నీరిచ్చే సామూహిక బిందు సేద్యం పథకం అటకెక్కింది. ఐదేళ్లుగా హంద్రీనీవా పనులు కట్టు కదల్లేదు. టీడీపీ కూటమి ప్రభుత్వం చొరవ చూపి.. అనంత రైతు కరువును జయించేందుకు సహకరించాల్సిన అవసరం ఉంది. టీడీపీ అధినేత, నాలుగోసారి ముఖ్యమంత్రి బాధ్యతలు చేపట్టనున్న చంద్రబాబు మునుపటిలాగే హంద్రీనీవా పనులను పరుగులు పెట్టించి పూర్తి చేయించాలని రైతాంగం కోరుతోంది.

1(వివరాలు 7లో..)

- డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థ లేక అందని సాగునీరు
- ఉమ్మడి జిల్లాలో చెరువులను నింపడంలో నిర్లక్ష్యం
- కొత్త ప్రభుత్వం చొరవ చూపితే.. కరువును జయించే అవకాశం

ఎన్నాళ్లీ గోడు..!

ఇల్లు కట్టకుండా మోసం

- రూ.21 లక్షలతో కాంట్రాక్టర్ ఉడాయింపు?
- ఐదు నెలలుగా ముందుకు సాగని నిర్మాణం
- జిల్లా హౌసింగ్ కార్యాలయం ఎదుట బాధితుల ఆందోళన

అనంతపురం సిటీ, జూన్ 7: ఏదో సొంతిల్లు వస్తుంది కదా అని పలువురు లబ్ధిదారులు డబ్బులు చెల్లిస్తే దాన్ని తీసుకుని కాంట్రాక్టర్ కనబడకుండా పోయాడు. ఇంటి నిర్మాణం పూర్తికాకపోవడం, డబ్బులు పోవడంతో తాము మోసపోయామని భావించిన లబ్ధిదారులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని గృహ నిర్మాణశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు.

ఆందోళన చేస్తున్న బాధిత లబ్ధిదారులు



ఉపాధి నిధులు ఇవ్వని వైనం..

ప్రభుత్వం నిర్మించే ప్రతి ఇంటికి 90 రోజుల పనిదినం కింద కేంద్ర ప్రభుత్వం రూ. 24,470 చెల్లిస్తుంది. ఇదీ పక్కాగా.. ఆయా లబ్ధిదారులకు వెళ్లాల్సి ఉంది. ఆ తర్వాత కాంట్రాక్టర్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ ఈ 133 ఇళ్లలో సుమారు 100 ఇళ్లకు పైగా ఒక్క పైసా కూడా సంబంధిత అధికారులు మంజూరు చేయలేదు. బిల్లులు చెల్లింపుపై ఆయా శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో కాంట్రాక్టర్ మొండికేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఉపాధి బిల్లులు రాలేదు..
కట్టిన డబ్బు రాలేదు



త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి చేసి ఇస్తావంటే.. అధికారుల మాటలు విని కాంట్రాక్టర్‌కు రూ. 35 వేలు చెల్లించాం. చెల్లించినప్పటికి నుంచి ఇప్పటికి వరకు ఒక్క పని కూడా చేయలేదు. కనీసం కాంట్రాక్టర్ కనిపించనే లేదు. అధికారులను అడిగితే.. అదిగో.. ఇదిగో.. అంటున్నారు. సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. పోనీ ఉపాధిహామీ కింద 90 పని దినాల కింద ఇచ్చే రూ. 24,470 బిల్లులైనా ఇస్తే కొంతైనా మాకు ఇబ్బందులు తగ్గుతాయి.

- పుష్పలత

ఏం జరిగిందంటే..

జిల్లాలోని యాడికి మండలంలోని పిన్నెపల్లి గ్రామంలో జగనన్న లేఅవుట్‌లో ఆప్షన్-3 కింద 133మందికి ఇంటి పట్టాలను మంజూరు చేశారు. ఇంటి నిర్మాణ కాంట్రాక్టును సుదర్శన్ చంద్రశేఖర్ అనే వ్యక్తి దక్కించుకున్నాడు. తొలుత పనులు వేగంగానే సాగాయి. అయితే ప్రభుత్వం నుంచి బిల్లుల రావడం ఆలస్యం కావడంతో ఆ కాంట్రాక్టర్ పనులను ఇష్టారాజ్యంగా చేయసాగాడు. దీంతో ఇళ్ల నిర్మాణాలు ముందుకు సాగలేదు. ఇదే క్రమంలో నిర్మాణ ముడిసరుకుల ధరలు ఎక్కువగా ఉన్నాయని భావించిన ప్రభుత్వం కాంట్రాక్టర్లకు మేలు చేసే విధంగా ఓ జీవోను తీసుకువచ్చింది. ఒక్కో లబ్ధిదారుడు అదనంగా రూ. 35 వేలు చెల్లించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ఇదే అదనుగా 133మంది లబ్ధిదారులపై రూ. 35 వేలు చెల్లించాలని ఒత్తిడి చేశాడు. దీంతో సుమారు 60 మంది అడిగిన సొమ్ము చెల్లించారు. మొత్తం రూ.21 లక్షల సొమ్ము వసూలు కాగా ఎంపీడీఓ ద్వారా కాంట్రాక్టర్‌కు చెల్లించారు. డబ్బు తీసుకున్న కాంట్రాక్టర్ ఐదు నెలలుగా పత్తాలేకుండా పోయాడు. అధికారులను అడిగితే అదిగో.. ఇదిగో అంటూ వచ్చారు. చివరికి ఎన్నికల ప్రక్రియ రావడంతో అటు కాంట్రాక్టర్. ఇటు అధికారు లు తమ సమస్యను పట్టించుకోలేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేశా రు. నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాతే కాంట్రాక్టర్‌కు డబ్బులు చెల్లించాలి. కానీ 133 ఇళ్లలో ఏ ఇల్లు కూడా ఇప్పటికి పూర్తి కాలేదు. కానీ అధికారులు గుట్టుచప్పుడు కాకుండా చెల్లించడం విమర్శలకు తావిస్తోంది. అధికారులను అడిగితే అడ్వాన్సుగా తీసుకున్నారని చెప్పి తప్పించుకోవడం మొదలెట్టారు.



రూ.35 వేలు చెల్లించిన రసీదులు చూపిస్తున్న లబ్ధిదారులు

స్లాబ్ కుంగిపోయింది: షేకున్‌బీ



అన్ని సదుపాయాలతో ఇంటిని అప్పగిస్తామంటే ఆరు నెలల కిందట రూ.35 వేలు చెల్లించాం. స్లాబ్ వేసి ఐదు నెలలైంది. ఇప్పటి వరకు గోడలకు ప్లాస్టింగ్ కూడా చేయలేదు. స్లాబ్ కూడా కుంగిపోయింది. ఏమాత్రం నాణ్యత లేకుండా నిర్మిస్తున్నారు. అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఐదు నెలల నుంచి ఇంటి నిర్మాణం చేయలేదు. కాంట్రాక్టర్‌ను అడిగితే పట్టించుకోవడం లేదు. చెల్లించిన నగదు వెనక్కి ఇస్తే మిగిలిన నిర్మాణం మేమే చేసుకుంటాం.

రూ. 35 వేలు ఇస్తేనే స్లాబ్ వేస్తామన్నారు: పెద్దక్క



నేను నా భర్త కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాం. జగనన్న ఇల్లు మంజూరైంది. ఆప్షన్-3 కింద ప్రభుత్వమే కట్టిస్తుంది అంటే ఏంతో సంతోషపడ్డాం. చివరికి అదనంగా రూ. 35 వేలు చెల్లించాలని అధికారులు ఒత్తిడి చేశారు. చెల్లించకపోవడంతో నిర్మాణం ఆపేశారు. స్లాబ్ వేయాలంటే.. రూ. 35వేలు చెల్లించాలని డిమాండ్ చేయడంతో అప్పు చేసి మరి చెల్లించాం. కానీ ఇప్పటి వరకు ఇంటి నిర్మాణం పూర్తి చేయలేదు. దీనిపై కాంట్రాక్టర్, అధికారులను అడిగితే ఏమాత్రం పట్టించుకోవడం లేదు.

త్వరలోనే పనులు చేయించేలా చూస్తాం

యాడికిలోని పిన్నేపల్లి జగనన్న లేఅవుట్‌లోని లబ్ధిదారులకు సంబంధించిన ఇళ్ల నిర్మాణాలు త్వరలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించాం. పనులు చేయకపోతే లబ్ధిదారులు కట్టిన డబ్బులు వెనక్కి ఇప్పించేలా చర్యలు తీసుకుంటాం. ఉపాధి పథకం నుంచి వచ్చే బిల్లులు కూడా త్వరగా చెల్లిస్తాం. లబ్ధిదారులు ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదు.



- నరసింహారెడ్డి, ఇన్‌చార్జి పీడీ

రైతుల సంక్షేమం కోసం

పనిచేయండి

కలెక్టర్ వినోద్‌కుమార్



వ్యవసాయశాఖ సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్ కుమార్

అనంతపురం టౌన్, జూన్ 7: కరువు జిల్లాగా పేరున్న అనంతలో రైతుల సంక్షేమం కోసం ప్రతిఒక్కరూ చిత్తశుద్ధితో పనిచేయాలని కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ అధికారులకు సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. వర్షాలు, పంటలు, విత్తన సరఫరా గురించి తెలుసుకున్నారు. వేరుశనగ విత్తనాన్ని అడిగిన ప్రతి రైతుకూ అందించాలని సూచించారు. పచ్చిరొట్ట, అంతర పంటల విత్తనాలను కూడా రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాకు అవసరమైన విత్తనాల వివరాలను వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయం దృష్టికి తీసుకువెళ్లి తెప్పించుకోవాలని అన్నారు. అంతర పంటల సరళిని అధ్యయనం చేయాలని, లాభదాయకమైన పంటలను సాగుచేసేలా రైతులలకు సూచనలు ఇవ్వాలని సూచించారు. రైతులకు కొత్త అంశాలపై అవగాహన పెంచడానికి శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. కె-6తోపాటు గుజరాత్ గిరినార్-4, 5 రకాల వేరుశనగ సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. సమావేశంలో జేడీఏ ఉమామహేశ్వరమ్మ, రేకులకుంట, కదిరి శాస్త్రవేత్తలు తదితరులు పాల్గొన్నారు.

వానలే.. వానలు!

నీట మునిగిన పత్తి, సజ్జ పంటలు.. పొంగి పొర్లుతున్న వాగులు, వంకలు..

వర్షంలో అనంతపురం నగరం









అనంతపురం అర్బన్/బొమ్మనహాళ్/డి.హీరేహాళ్, జూన్ 7: నైరుతి రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. అనంతపురం, వజ్రకరూరు మండలాల్లో శుక్రవారం రాత్రి భారీ వర్షం కురిసింది. శింగనమల, రాప్తాడు, గార్లదిన్నె, పామిడి, నార్పల, పుట్లూరు, కూడేరు, బొమ్మనహాళ్, బెళుగుప్ప మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. యాడికిలో చిరుజల్లులు పడ్డాయి. జిల్లాలోని 23 మండలాల్లో గురువారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా గుమ్మఘట్టలో 89.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. శెట్టూరు 51.2, యల్లనూరు 45.8, రాయదుర్గం 45.6, కంబదూరు 43.4, రాప్తాడు 24.6, బెళుగుప్ప 24.2, బొమ్మనహాళ్, ఆత్మకూరు 20.0 మి.మీ. వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 18.0 మి.మీ.లోపు వర్షపాతం నమోదైంది.

- బొమ్మనహాళ్ మండలంలో రెండురోజులుగా కురుస్తున్న వర్షాలకు పొలాల్లో నీరు చేరింది. పత్తి పంట కుళ్లిపోతోంది. ఎగువ ప్రాంతం నుంచి వరదనీరు వస్తుండటంతో కొళగానహళ్లి వద్ద కబ్బాలి వంక, ఉద్దేహాళ్ వద్ద వేదవతి హగరి నది పొంగి ప్రవహిస్తున్నాయి. కృష్ణాపురం, రంగాపురం క్యాంప్, కళ్లదేవనహళ్లి, సింగానహళ్లి, లింగదహాళ్ తదితర గ్రామాల పరిధిలో పత్తి, సజ్జ పంట పొలాల్లోకి వర్షపునీరు చేరింది. దీంతో పత్తి మొక్కలు ఎర్రగా మారి కుళ్లిపోతున్నాయి. తీవ్రంగా నష్టపోతున్నామని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.
- కళ్లదేవనహళ్లి సమీపంలోని బ్రిడ్జి వద్ద రోడ్డు కుంగిపోయింది. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. రెండేళ్ల క్రితం వరదకి రోడ్డు కుంగిపోయి, ఎనిమిది గ్రామాల నడుమ రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో మరమ్మతు పనులకు రూ.1.20 కోట్లు వైసీపీ ప్రభుత్వం మంజూరు చేసింది. వైసీపీ నాయకులు రాళ్లు, మట్టి, పైపులు వేశారు. బిల్లులు మంజూరు కాకపోవడంతో అంతటితో ఆపేశారు. మరోసారి అదే ప్రాంతంలో రోడ్డు కుంగిపోయింది.
- కర్ణాటకలోని గవిసిద్ధేశ్వరం కొండ ప్రాంతంలో శుక్రవారం భారీ వర్షాలు కురిశాయి. కర్ణాటకలో వర్షాలు, స్థానికంగా కురిసిన వర్షాలకు డి.హీరేహాళ్ మండలంలో వంకలు, వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. బళ్లారి-రాయదుర్గం రోడ్డులో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. హిర్దేహాళ్ సమీపంలో హైవే పక్కన ఉన్న ఎల్లమ్మవంక, ఫులకుర్తి సమీపంలోని కానుక వంక, సోమలాపురం గంగమ్మ వంకకు వరద పోటెత్తడంతో రాకపోకలు నిలిచిపోయాయి. సుమారు మూడుగంటల పాటు వాగులకు ఇరువైపులా వాహనాలు కిలోమీటర్ల పొడవున నిలిచిపోయాయి. ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాదాలు జరుగకుండా ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఉద్దేహాళ్ వద్ద వేదవతి హగరికి భారీగా వచ్చిన వరదనీరు



బళ్లారి-రాయదుర్గం రోడ్డులో పొంగుతున్న వాగు



కృష్ణాపురం వద నీట మునిగిన పత్తిపంట

రూ.7 కోట్లకు ఎసరు..?

నగరపాలికలో హడావుడిగా బిల్లులు

అనంతపురం క్రైం, జూన్ 7: అనంత నగరపాలికలో హడావుడిగా రూ.7 కోట్ల బిల్లు చేసుకునేందుకు ప్రయత్నించారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడంతో బిల్లులు ఆగిపోతాయనే భయంతో గుట్టుగా వ్యవహారం నడపాలని ప్రయత్నించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. కానీ ఉన్నతాధికారులకు తెలియడంతో బ్రేక్ పడినట్లు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్నంతకాలంలో కొన్ని అడ్డగోలు పనులకు సైతం బిల్లులు చేశారు. ప్రభుత్వ పథకాల ప్రచార కార్యక్రమాలకు సైతం రూ.10లక్షల చొప్పున బిల్లులు పెట్టారు. కొన్ని పనులను సగం పూర్తి చేసి వదిలేశారు. కొన్నింటిని నాసిరకంగా చేశారు. ఎన్నికల్లో వైసీపీ ఘోరంగా ఓడిపోయింది. టీడీపీ కూటమి అధికారం చేపట్టనుంది. దీంతో నగరపాలికలోని కొందరు కాంట్రాక్టర్లు, నాయకులు తమ బిల్లులను పాస్ చేయించుకోవాలని చూస్తున్నారు. గతంలో మాదిరిగా ఇప్పుడు చెక్కులు ఇచ్చే పరిస్థితులు లేవు. ప్రతి బిల్లూ సీఎఫ్ఎంఎస్‌లోకి వెళ్లాల్సిందే. దీంతో తమకు అనుకూలంగా ఉన్న ఇంజనీరింగ్ విభాగం సిబ్బందితో ఆ బిల్లుల ఫైల్స్‌ను పైకి పంపేందుకు ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. ఉన్నతాధికారులకు దృష్టికి వెళ్లడంతో తాత్కాలికంగా బ్రేక్ వేసినట్లు తెలుస్తోంది.





పడకేసిన హంద్రీనీవా పనులు




- డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం ప్రశ్నార్థకం
- 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందేనా..?
- కలగానే మడకశిర బైపాస్ కాలువ
- మూలనపడిన సామూహిక బిందు సేద్యం
- కూటమి గెలుపుతో చిగురించిన ఆశలు


రిజర్వాయర్ గేట్లను పరిశీలిస్తున్న హంద్రీనీవా ఎస్ఈ దేసేనాయక్, ఇంజనీర్లు(ఫైల్)

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 7: వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టులను పూర్తిగా అటకెక్కించింది. ఒక్క ప్రాజెక్టు గానీ, చెరువు పనులు గానీ ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. దీంతో ఎంతో అవకాశం ఉన్నా నీట వనరులను ఉపయోగించుకోలేని దయనీయ పరిస్థితి నెలకొంది. గడిచిన ఐదేళ్లుగా హంద్రీనీవాకు సంబంధించి ఏ ఒక్క పనీ ముందుకు సాగలేదు. కరువు జిల్లాలో హంద్రీనీవా ద్వారా వచ్చే కృష్ణా జలాలను సద్వినియోగం చేసుకుని సస్యశ్యామలం చేసే అవకాశం ఉన్నప్పటికీ...ఐదేళ్లుగా నిర్వీర్యం చేశారు. హంద్రీనీవాకు శ్రీశైలం డ్యాం నుంచి 42 టీఎంసీల నీటి కేటాయింపులు ఉన్నాయి. ఇందులో ఉమ్మడి అనంతపురం జిల్లాకు సుమారు 30టీఎంసీల నీటిని వాడుకునే వెసులుబాటు ఉంది. అందుకు తగ్గట్టుగా రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీ వ్యవస్థలు లేవు. దీనిపై ఇప్పటికే అనేకమార్లు హంద్రీనీవా ఇంజనీర్లు ప్రతిపాదనలు పంపినా...వైసీపీ ప్రభుత్వం బుట్టలోకి వేస్తూ వచ్చింది. వీటితో పాటు మడకశిర బైపాస్ కెనాల్, పుట్టపర్తి నియోజవకర్గంలో 195 ఎంఐ చెరువులకు నీరు అందించే ప్రాజెక్ట్, గుంతకల్లు నియోజకవర్గంలో 12 చెరువులకు నీరిచ్చే పనులను పక్కన పడేశారు. ఉరవకొండ ప్రాంతంలో సుమారు 50వేల ఎకరాలకు సామూహిక బిందు సేద్యం ద్వారా సాగునీరు అందించేందుకు గత టీడీపీ ప్రభుత్వం 2018లో తీసుకువచ్చింది. వైసీపీ ప్రభుత్వం మూలనపడేసింది. రాప్తాడు నియోజకవర్గంలో మూడు జలాశయాలను ఇచ్చిన హామీని వైసీపీ బుట్టలో పడేసింది. హంద్రీనీవా పథకాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తే... ఉమ్మడి జిల్లాకు 3.45 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు ఇచ్చి సమస్యశ్యామలం చేయడంపై కొత్త ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు దృష్టి సారించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు. రూ.1200 కోట్లతో డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు పంపిన ప్రతిపాదనలు అలాగే ఉండిపోయాయి.


బిందు సేద్య పరికరాలను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు(ఫైల్)



మూలనపడిన సామూహిక బిందు సేద్యం

హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పొలాలకు నీటి సదుపాయం కల్పించడానికి గతంలో టీడీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం (సీఎల్‌డీఐ) పథకాన్ని తీసుకు వచ్చింది. రూ.840 కోట్లతో 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం సీఎల్‌డీఐ పథకాన్ని రద్దు చేసింది. తక్కువ నీటితో అధిక పంటల దిగుబడి సాధించే విధంగా రైతులను ప్రోత్సాహించేందుకుగాను కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి కిసాన్ సంరక్షణయోజనా పథకం కింద సుమారు రూ.271కోట్లు నిధులు చెల్లిస్తామని అప్పట్లో చెప్పారు. బెళుగుప్ప, కూడేరు, ఉరవకొండ మండలాల్లో సుమారు 50వేల ఎకరాలకు సాగునీరు అందించేందుకు సీఎల్‌డీఐ తీసుకువచ్చారు. వైసీపీ ప్రభుత్వం 2019లో పథకాన్ని పూర్తిగా రద్దు చేసింది. ఇందుకు సంబంధించి పరికరాలను మూలన పడేశారు.

కలగానే మడకశిర బైపాస్ కాలువ నిర్మాణం

హంద్రీనీవా ద్వారా మడకశిరకు సాగు, తాగునీరు అందించేందుకు గత ప్రభుత్వం పెనుకొండ నుంచి నేరుగా మడకశిరకు నీటిని తరలించాలనే ఉద్దేశ్యంతో మడకశిర బైపాస్ కాలువ ప్రాజెక్ట్‌ను రూ.177కోట్లతో అంచనాలు తయారుచేసింది. వైసీపీ ఈ ప్రాజెక్ట్‌నూ విస్మరించింది. పుట్టపర్తి నియోజకవర్గంలోని 195మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని తరలించాలనే ఉద్దేశ్యంతో రూ.737కోట్లతో ప్రతిపాదనలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది. ముదిగుబ్బ మండలంలో జిల్లేడుబండ రిజర్వాయర్ నిర్మాణానికి రూ.608కోట్లతో ప్రాజెక్ట్‌ను టీడీపీ ప్రభుత్వం ఆమోదించింది. ఇందుకు సంబంధించి ఇప్పటి వరకు రూ.100కోట్లు పనులు చేశారు. దీనికి వైసీపీ ప్రభుత్వం వచ్చాక ఇప్పటి వరకు ఒక్క పైసా విదల్చలేదు. గుంతకల్లు, గుత్తి పరిధిలోని 12మైనర్ ఇరిగేషన్ చెరువులకు ఫీడర్ చానల్ ద్వారా హంద్రీనీవా నీటిని అందించేందుకు రూ.20కోట్లతో చేసిన ప్రతిపాదలను వైసీపీ ప్రభుత్వం తిరస్కరించింది.


హంద్రీనీవా కార్యాలయం

సామూహిక బిందు సేద్యం అమలు చేయాలి:

కరువు జిల్లాలో వెనుకబడిన ప్రాంతమైన ఉరవకొండ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వం చేపట్టిన సామూహిక బిందు సేద్యం పథకాన్ని వెంటనే అమలు చేయాలి. గత ఐదేళ్లుగా వైసీపీ ప్రభుత్వం సామూహిక బిందు సేద్యం పథకాన్ని మూలనపడేసింది. కొత్త ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేసి రైతులను ఆదుకోవాలి. కోట్లాది రూపాయల పరికరాలను గాలికివదిలేయం బాధాకరం. రైతులకు ఉపయోగపడే పనులను నిర్లక్ష్యం చేయడం మంచిదికాదు.


- కురుగుంట మనోహర్, రైతుసంఘం నాయకుడు, ఉరవకొండ

డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలి: సుల్తాన్, రైతు, ఉరవకొండ


హంద్రీనీవా పథకం కింద డిస్ట్రిబ్యూటరీలు నిర్మించాలి. పిల్ల కాలువల ద్వారా హంద్రీనీవా నీటిని నేరుగా ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. పంటలకు కనీస నీటి వసతి లేక నానా అవస్థలు పడుతున్నాం. డిస్ట్రిబ్యూటరీల నిర్మాణం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలి. ఇప్పటికే అనేకమార్లు హంద్రీనీవా అధికారులకు విన్నవించాం.

ప్రతిపాదనలను అమలు చేస్తే జిల్లా సస్యశ్యామలం

హంద్రీనీవా ఇంజనీర్లు చేసిన ప్రతిపాదనలు అమలుచేస్తే ఉమ్మడి అనంతపురం జిల్లా సస్యశ్యామలమవుతుంది. హంద్రీనీవా కాలువ కింద డిస్ట్రిబ్యూటరీల నిర్మాణాలకు రూ.1200 కోట్లు ప్రతిపాదనలు పంపాం. మడకశిర బైపాస్ కెనాల్, గుంతకల్లు, పుట్టపర్తి మైనర్ ఇరిగేషన్ చెరువులకు నీళ్లు నింపే ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు అందజేశాం. హంద్రీనీవా కాలువకు కాంక్రీట్ లైనింగ్ వేసి, డిస్ట్రిబ్యూటరీలను నిర్మిస్తే ఉమ్మడి జిల్లాలో 3.45 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ప్రజాప్రతినిధులు దృష్టిపెడితే మా వంతుగా పూర్తి సహకారం అందిస్తాం.


- దేసేనాయక్, ఎస్ఈ, హెచ్ఎన్ఎస్ఎస్-2

బీటీపీ, పేరూరు ప్రాజెక్టల పరిస్థితీ అంతే..

గత టీడీపీ ప్రభుత్వం బీటీపీ, పేరూరు ప్రాజెక్టులను ఆమోదిస్తూ నిధులు కేటాయించింది. 2019లో అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ రెండు ప్రాజెక్టులను పూర్తిగా విస్మరించింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు జీడిపల్లి రిజర్వాయర్ నుంచి హంద్రీనీవా నీటిని తరలించేందుకు 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.541కోట్లు కేటాయించింది. చేసిన అరకొర పనులకూ వైసీపీ ప్రభుత్వం బిల్లులు చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు చేసిన పనుల్లో రూ.20కోట్లు బకాయిలు చెల్లించాల్సిఉంది. అదే జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు డ్యాంకు నీళ్లు తరలించేందుకు అప్పర్ పెన్నా ప్రాజెక్టుకు రూ.591కోట్లు నిధులతో చేపట్టారు. 53కిలో మీటర్ల కాలువ పనులతో పాటు సోమరవాండ్లపల్లి, పుట్టకనుమ తగరకుంట వద్ద రెండు జలాశయాలు నిర్మించాలని పనులు చేపట్టారు. ఇప్పటి వరకు రూ.164కోట్లు పనులు చేయగా రూ.100కోట్లకుపైగా బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

చంద్రబాబు, లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యేలు

న్యూస్ నెట్‌వర్క్, ఆంధ్రజ్యోతి: టీడీపీ అధినేత చంద్రబాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను కొత్త ఎమ్మెల్యేలు కలిశారు. ఉండవల్లిలోని వారి నివాసంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, ఆమె సోదరి కిన్నెరశ్రీ కలిశారు. నారా లోకేశ్‌ను మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి కలిసి సత్కరించారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూ రారెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి, కేరళ రిటైర్డ్ డీజీపీ శంకర్‌రెడ్డి చంద్రబాబును మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ అధినేత చంద్రబాబును కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు శుక్రవారం ఢిల్లీలో కలిసి సత్కరించారు. అఖండ మెజార్టీతో గెలిచిన తనను చంద్రబాబు అభినందించారని ఆయన తెలిపారు. తనతో పాటు తన కుమారుడు యశ్వంత్‌చౌదరి, నాయకులు రాజగోపాల్ చంద్రబాబుకు శుభాకాంక్షలు తెలియజేశామని అన్నారు.


చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పల్లె కుటుంబసభ్యులు


చంద్రబాబుతో బండారు శ్రావణిశ్రీ


చంద్రబాబునాయుడును శాలువాతో సన్మానిస్తున్న సురేంద్రబాబు


ఎంఎస్ రాజు, గుండుమల తిప్పేస్వామి

పద్మ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 7: కేంద్రహోంమంత్రిత్వ శాఖ 2025వ సంవత్సరం రిపబ్లిక్ డే నాడు అందజేయనున్న పద్మ అవార్డులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి కరుణకుమారి తెలిపారు. కళలు, సాహిత్యం-విద్య, క్రీడలు, వైద్యం, సామాజిక-సాంఘిక సేవ, సైన్స్-ఇంజనీరింగ్, ప్రజా సంబంధాలు, సివిల్ సర్వీసెస్, ట్రేడ్-ఇండస్ట్రీ అంశాలలో ఉత్తమ సేవలు అందించిన సేవకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. దరఖాస్తులను రాష్ట్రీయ పురస్కార్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు సెల్ నంబరు 9959517370ను, వెబ్‌సైట్:https://awards.gov.in. వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు..

కేంద్ర యువజన వ్యవహారాలు-క్రీడల మంత్రిత్వశాఖ ఏటా అందజేసే టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు 2023 సంవత్సరానికి గాను దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి కరుణకుమారి తెలిపారు. 2021, 2022, 2023 సంవత్సరాల్లో భూమి, నీరు (సముద్రం), గాలి వంటి వాటిపై చేసిన సాహస కార్యకలాపాల్లో అత్యుత్తమ విజయాలు సాధించిన సాహసికులు టెన్సింగ్ నార్కే జాతీయ సాహస అవార్డులకు అర్హులన్నారు. సాహస క్రీడల్లో తమకు తాము అంకితం చేసుకుని, నైపుణ్యం ప్రదర్శించిన వ్యక్తులకు జీవితకాల సాఫల్యం కింద ఈ అవార్డులను ప్రతి ఏటా రాష్ట్రపతి చేతుల మీదుగా అందజేస్తారన్నారు. అవార్డు గ్రహీతలకు టెన్సింగ్ నార్కే కాంస్య విగ్రహంతో పాటు ప్రశంసా పత్రం, రూ.15లక్షలు నగదు అందజేస్తారని తెలిపారు. ఈనెల 14వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సెల్ నంబరు 9959517370ను వెబ్‌సైట్: https://awards.gov.in సంప్రదించాలని కోరారు.

దీర్ఘకాలిక సెలవులో ఉద్యానశాఖ ఇన్‌చార్జి అధికారి

అనంతపురం అర్బన్, జూన్ 7: ఉద్యాన శాఖ జిల్లా ఇన్‌చార్జి అధికారి నరసింహారావు దీర్ఘకాలిక సెలవు పెట్టారు. దాదాపు 40 రోజులపాటు ఆయన సెలవు పెట్టినట్లు సమాచారం. ఏపీఎంఐపీ ఏపీడీ ఫిరోజ్ ఖాన్‌కు జిల్లా ఉద్యాన శాఖ అధికారిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించనున్నారు.

గుట్టనే మింగేస్తున్నాడు..!



- ప్రభుత్వ భూమిపై కన్ను
- ఎక్స్‌కవేటర్‌తో చదును
- పనులు అడ్డుకున్న అధికారులు

ఎక్స్‌కవేటర్‌తో గుట్టను చదును చేస్తున్న దృశ్యం

గాండ్లపెంట, జూన్7: మండలంలోని కోటూరు గ్రామానికి చెందిన వైసీపీ మద్దతుదారుడు ప్రభాకర్ ప్రభుత్వ భూమిలోని గుట్టనే మాయం చేస్తున్నాడు. భూమి సొంతం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. గ్రామ సర్వే నంబరు 275లో ప్రభాకర్‌కు పొలం ఉంది. పక్కనే సర్వే నంబరు 213లో 1.20 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో పెద్దగుట్ట ఉంది. రూ.7 లక్షల విలువైన ఆ భూమిపై ప్రభాకర్ కన్ను పడింది. ఎక్స్‌కవేటర్ సాయంతో రెండ్రోజులుగా గుట్ట చదును పనులు చేపడుతున్నాడు. విషయాన్ని స్థానికులు.. రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే వీఆర్వో చంద్రశేఖర్ రెడ్డి ఘటనాస్థలానికెళ్లి, పనులను నిలిపివేయించారు. ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలీస్ వాహనం బోల్తా

- డీఎస్పీకి తప్పిన ప్రమాదం
- ముగ్గురు కానిస్టేబుళ్లకు గాయాలు

పెనుకొండ రూరల్, జూన్ 7: మండలంలోని పులేకమ్మ గుడివద్ద 44వ జాతీయ రహదారిపై శుక్రవారం ద్విచక్రవాహనాన్ని తప్పించబోయి ప్రమాదవశాత్తు డీఎస్పీ వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీఎస్పీ బాబిజాన్‌సైదతో పాటు ముగ్గురు కానిస్టేబుళ్లు గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు డీఎస్పీతో పాటు హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్, నాగరాజు, హోంగార్డు జబీవుల్లా, డ్రైవర్ భైవరశెట్టి కారులో సోమందేపల్లి స్టేషన్‌కు వెళ్లి తిరిగి పెనుకొండకు వస్తున్నారు. పెనుకొండ సమీపంలోని పులేకమ్మ ఆలయం వద్దకు రాగానే పెనుకొండ వైపునుంచి ఓ ద్విచక్రవాహనదారుడు యూటర్న్ తీసుకుంటుండగా డీఎస్పీ వాహనం అతనిని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డీఎస్పీ ఎడమచేతికి స్వల్పగాయమైంది. హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్, నాగరాజు, హోంగార్డు జబీవుల్లా తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు హుటాహుటిన వాహనంలో నుంచి వారిని బయటికి తీశారు. క్షతగాత్రులను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి మరో కారులో తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌ను అనంతపురం ఆస్పత్రికి తరలించారు.


ప్రమాద స్థలంలో డీఎస్పీ


బోల్తా పడిన డీఎస్పీ వాహనం


గాయపడిన హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్

అధికారులకు అభినందనలు..

ముదిగుబ్బ, జూన్7: ఉమ్మడి అనంతపురం జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించడానికి సహకరించిన అధికారులకు అభినందనలు తెలుపుతున్నట్లు జాతీయ మానవహక్కుల కౌన్సిల్ దక్షిణ భారతదేశ రాష్ట్రాల గౌరవాధ్యక్షుడు వెంగమేష్ చౌదరి పేర్కొన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. సామాన్య ప్రజలకు ఇబ్బందులు కలగకుండా, ఎక్కడా అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఎన్నికలు ముగియడం హర్షణీయమన్నారు. పూర్తి కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసి ఎన్నికలను విజయవంతం చేసిన కలెక్టర్, ఎస్పీ, సంబంధిత అధికారులకు అభినందనలు తెలిపారు. మానవహక్కుల విషయంలో ప్రజలకు అండగా నిలుస్తున్నామన్నారు. హ్యూమన్ రైట్స్ జాతీయ స్థాయిలో విస్తృతంగా పనిచేస్తోందన్నారు. హక్కులకు ఎక్కడ భంగం కలిగినా తమ కమిటీ సంపూర్ణ మద్దతు ఇస్తూ అండగా నిలబడుతోందన్నారు. గ్రామ స్థాయిలో ఎక్కడైనా హక్కులకు భంగం వాటిల్లితే తమ దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరిస్తామని ఆయన పేర్కొన్నారు.


వెంగమేశ్ చౌదరి

అక్కడ జరిగింది సంబరాలే: ఎస్పీ



పుట్టపర్తి రూరల్, జూన్ 7: రామగిరి మండలం సుద్దకుంటపల్లి తండాలో వేటకొడవళ్లతో వీరంగం సృష్టించారని ఓ న్యూస్ చానల్‌లో వచ్చిన కథనంలో వాస్తవం లేదని ఎస్పీ మాధవరెడ్డి స్పష్టం చేశారు. పుట్టపర్తిలోని డీపీఓలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆ ఘటనపై వెంటనే విచారించామన్నారు. సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఈ నెల 4న తమ పార్టీ అభ్యర్థి గెలుపొందారన్న సమాచారంతో గ్రామంలో కొందరు కార్యకర్తలు సంబరాలు చేసుకున్నారని అన్నారు. పొట్టేలును కోసేందుకు వారు మచ్చుకత్తులు పట్టుకున్నారని, ఎవరినీ భయభ్రాంతులకు గురిచేయలేదని వివరించారు. వీరంగం సృష్టించే ఉద్దేశం వారికి లేదని పోలీసు విచారణలో తేలిందని అన్నారు. ఆ న్యూస్ చానల్ కథనం పూర్తిగా అవాస్తమని ఎస్పీ స్పష్టం చేశారు. ఘటనను వక్రీకరించి, ప్రత్యర్థులను బెదిరించడానికి, గ్రామంలో భయానక వాతావరణం సృష్టించడానికి వేటకొడవళ్లతో వీరంగం చేశారని, ఆ న్యూస్ చానల్ ప్రచారంపై వెంటనే విచారణ చేపట్టాలని రామగిరి పోలీసులను ఆదేశించామని తెలిపారు. తండాలో ఎన్నికల కోడ్ ఉల్లంఘించి సంబరాలు చేసుకున్నందుకు కేసు నమోదు చేశామని తెలిపారు. ఎన్నికల్లో ఓడిపోయిన అనంతరం వైసీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని, వేటకొడవళ్లతో వీరంగం చేశారని ఓ చానల్‌లో కథనం ప్రసారమైంది. ఈ కథనాన్ని పోలీసు శాఖ సీరియస్‌గా తీసుకుంది.

సస్పెన్షన్లు ఎత్తివేయండి

- కలెక్టర్‌ను కోరిన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

అనంతపురం టౌన్, జూన్7: ఎన్నికల నేపథ్యంలో పలు కారణాలతో ఉద్యోగ, ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారని, ఆ సస్పెన్షన్లను ఎత్తి వేయాలని ఆయా సంఘాల నేతలు కోరారు. శుక్రవారం ఏపీఎస్ఈ, ఆపస్, ఎస్ఎల్‌టీఏ, డీటీడబ్ల్యూ సంఘాల నాయకులు కలెక్టర్‌ను కలిసి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించినందుకు అభినందించారు. అనంతరం సంఘాల నేతలు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో సస్పెండ్ అయినవారి ఉత్తర్వులను రద్దుచేసి విధుల్లోకి తీసుకోవాలని కోరారు. బీఎల్‌ఓలకు నిబంధనల మేరకు గౌరవ వేతనం చెల్లించాలని, ఎన్నికల రెమ్యునరేషన్‌లో అసమానతలను తొలగించాలని కోరుతూ వినతి పత్రం అందజేసారు. కార్యక్రమంలో ఏపీస్టేట్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు విజయబాస్కర్, ఆపస్ జిల్లా ప్రధానకార్యదర్శి ఎర్రిస్వామి, రాష్ట్రకార్యదర్శి రాజేంద్ర, ఎస్ఎల్‌టీఏ జిల్లా అధ్యక్షుడు ఆదిశేషయ్య, డీటీడబ్ల్యుఏ నాయకులు వెంకటేష్, నాగరాజుపాల్గొన్నారు.


కలెక్టర్‌ను అభినందిస్తున్న ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు

చీనీకాయలు టన్ను రూ.40 వేలు

అనంతపురం రూరల్, జూన్ 7: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.40 వేలు, కనిష్ఠంగా రూ.16 వేలు, సరాసరి రూ.26 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 604 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

రైళ్ల రద్దు

గుంతకల్లు, జూన్ 7: సెంట్రల్ రైల్వేలో జరుగుతున్న మరమ్మతు పనుల కారణంగా గుంతకల్లు మీదుగా వెళ్లే రెండు రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు. బిలాస్‌పూర్ నుంచి యలహంక వెళ్లే ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక రైలు (08291)ను ఈనెల 15, 18, 22, 25, 29 జూలై 1, 4, 8 తేదీల్లోనూ, దీని తిరుగు ప్రయాణపు రైలు (నెం. 08292)ను ఈనెల 17, 20, 24, 27, జూలై 1 4, 8 తేదీల్లోనూ రద్దు చేసినట్లు తెలిపారు. చెన్నై-సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్ (నెం 22601) ఈ నెల 12, 19 తేదీల్లో చెన్నై నుంచి రెండు గంటల ఆలస్యంగా బయల్దేరుతుందని తెలిపారు. ప్రయాణికులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.



వెంకటశివుడు యాదవ్‌ను సన్మానిస్తున్న నాయకులు

టీడీపీ జిల్లా అధ్యక్షుడికి సన్మానం

అనంతపురం అర్బన్, జూన్ 7 : జిల్లాలో అన్ని స్థానాల్లో కూటమి అభ్యర్థులు విజయం సాధించిన నేపథ్యంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్‌ను పలువురు టీడీపీ నాయకులు సన్మానించారు. శుక్రవారం స్థానిక టీడీపీ జిల్లా కార్యాలయంలో టీడీపీ నాయకులు సాలార్ బాషా, బాబాఫక్రుద్దీన్, అబ్దుల్ రజాక్, ఎస్ఎం బాషా, రమేష్‌బాబు, చాకలి సుంకన్న, చాకలి చంద్రశేఖర్ తదితరులు ఆయన్ను సన్మానించారు.

టీడీపీ సంబరాలు



సంబరాల్లో ఎల్ నారాయణ చౌదరి

రామగిరి, జూన్ 7: పరిటాల సునీత భారీ విజయం సాధించడంపై మండలంలోని ఎంసీ పల్లిలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎల్‌నారాయణచౌదరి ఆధ్వర్యంలో శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. నారాయణచౌదరి సొంత పంచాయతీలో 700 పైగా టీడీపీ మెజారిటీ సాధించింది. ఈ సందర్భంగా విందు ఏర్పాటు చేశారు. మొదట గ్రామంలోని ఆలయాలకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం గ్రామాల్లో ఊరేగింపులు నిర్వహించారు.

సిండికేట్ నగర్‌లో....



కేక్ కట్ చేస్తున్న పరిటాల శీనప్ప

అనంతపురంరూరల్ : రాప్తాడు నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి పరిటాల సునీత భారీ మెజార్టీతో విజయం సాధించడంపై మండలంలోని సిండికేట్ నగర్‌లో టీడీపీ నాయకులు శుక్రవారం సంబరాలు జరుపుకున్నారు. గ్రామంలోని చౌడమ్మ ఆలయం వద్ద టెంకాలు కొట్టి- పరిటాల శీనప్పతో కేక్ కట్ చేయించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దమ్మకు మొక్కు తీర్చుకున్న టీడీపీ నాయకులు



పెద్దమ్మ ఆలయం వద్ద టీడీపీ నాయకులు

శింగనమల, జూన్ 7: ఎమ్మెల్యేగా బండారు శ్రావణిశ్రీ విజయం సాధించడంపై మండలంలోని తరిమెలలో టీడీపీ నాయకులు శుక్రవారం పెద్దమ్మకు 101 టెంకాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రవాసాంధ్రులకు ఘన సన్మానం



బెంగళూరులో టీడీపీ ఫోరం ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రులకు సన్మానం

శింగనమల జూన్ 7: టీడీపీ గెలుపు కోసం కృషి చేసిన ప్రవాసాంధ్రులకు టీడీపీ బెంగుళూరు ఫోరమ్ సభ్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం బెంగుళూరులోని లక్ష్మిపురంలోని టీడీపీ ఫోరం సభ్యులు శ్రీనివాస్ నాయుడు, మధు, బాబు, బాషా, రాజా, అమీర్, అన్వర్, అక్బర్, శ్రీధర్, కుళ్లాయప్ప ట్రావెల్స్ బాషా ఆధ్వర్యంలో ప్రవాసాంధ్రులను సన్మానించారు. సన్మానం పొందిన వారిలో శింగనమల మండలంలోని ఈస్టు నరసాపురం చెందిన యువకులు ఉమ్మని ఓబిలేసు, అనిల్, ఉమ్మనినాయుడు, నవీన్ చౌదరి, హేమచంద్రనాయుడు, బోడపాటి నరేష్ ఉన్నారు.

కూటమి విజయంపై ఎమ్మార్పీఎస్ సంబరాలు

అనంతపురం అర్బన్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ఘన విజయంతో స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్, అనుబంధ విభాగాల నాయకులు బాణా సంచా కాల్చి శుక్రవారం సంబరాలు చేసుకున్నారు. అనంతరం మోదీ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మందకృష్ణ మాదిగల ఫొటోలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ బీసీఆర్ దాస్, అమర్, రాము, ఓబుళపతి, రాముడు, రామచంద్ర, నరసింహ, కుళ్లాయప్ప, శివ, జయప్ప పాల్గొన్నారు.

వైఎస్సార్ విగ్రహం తొలగింపు సరైనదే

అనంతపురం సెంట్రల్, జూన్ 7: అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎస్కేయూలో వైఎస్సార్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారని, తిరిగి దానిని తొలగించడం సరైందేనని ఐక్య విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు అభిప్రాయపడ్డాయి. ఏఐఎస్ఏ, ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, టీఎన్ఎస్ఎఫ్ తదితర విద్యార్థి సంఘాలు. ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీతోపాటు ఎమ్మార్పీఎస్, బీఎస్పీ నాయకులు ఎస్కేయూ పాలకమండలి తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. వర్సిటీల్లో ఏ రాజకీయ నాయకుల విగ్రహాన్నీ ఏర్పాటు చేయకూడదని పలుమార్లు ధర్నాలు చేసినా వైసీపీ ప్రభుత్వానికి పట్టలేదన్నారు. ఇలాంటి చెంపపెట్టు వ్యవహారాలతో వైసీపీ సిగ్గుపడాలని పేర్కొన్నారు.

ముగిసిన గ్రంథాలయ వేసవి శిక్షణ శిబిరాలు

గార్లదిన్నె, జూన్ 7 : వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి శిక్షణ శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా కార్యదర్శి రమ పాల్గొన్నారు. వేసవి శిక్షణ శిబిరాల్లో పిల్లలు ఏం నేర్చుకున్నారని గ్రంథాలయ అధికారి శిరీషను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పిల్లలతో పాఠ్య పుస్తకాలు, కథల పుస్తకాలు చదివించి ఆటలు ఆడించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందచేశారు.

శింగనమల: స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యాక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ప్రతిభచాటిన 30 మంది విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్ఐ చితంబరయ్య, గ్రంథాలయాధికారి కృష్ణ లక్ష్మినారాయణరెడ్డి పాల్గొన్నారు.

ముంటిమడుగు ఆర్థికసాయం

గార్లదిన్నె, జూన్ 7 : మండలంలోని మర్తాడు గ్రామానికి చెందిన సుగాలి జ్యోతిబాయ్ కుమార్తె వాణిబాయ్ వివాహానికి శింగనమల నియోజకవర్గం టూమెన్ కమిటీ సభ్యులు ముంటిమడుగు కేశవరెడ్డి శుక్రవారం రూ.10 వేలు ఆర్థిక సాయం అందచేశారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధికార ప్రతినిధి గోసుల సుబ్బయ్య, అనీఫ్, ఆవుల సుధాకర్, లింగరాజు పాల్గొన్నారు.

చేతల్లేవ్.. సూచనలే..!



- వర్షాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలట...
- కమిషనర్, పాలకవర్గం హితబోధ
- ఎక్కడ చూసినా నీటి నిల్వలు
- చెత్త తొలగింపు చర్యలు శూన్యం
- మరమ్మతులకు నోచుకోని మురుగుకాలువలు

అనంతపురం క్రైం, జూన్ 7: చేయాల్సిన పనులు చేయించరు... కానీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలంటూ సూచనలు, హితవులు... రెండేళ్ల క్రితం వరదల్లోస్తే కొన్ని కాలనీల ప్రజలు అల్లాడిపోయారు. కాస్త వర్షం వస్తే చాలు ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాల్లోని కాలనీలు మునిగిపోతాయి. తీసుకోవాల్సిన చర్యలు తీసుకోకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు బాగా పనిచేయాలంటూ హితబోధ చేస్తూ నగర కమిషనర్ మేఘస్వరూప్ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఉన్న వారు మరో ప్రాంతానికి వెళ్లాలన్నారు. ఇక మేయర్ వసీం డిప్యూటీ మేయర్లు, కొందరు కార్పొరేటర్లు, అధికారులతో కలిసి తన ఛాంబర్‌లో సమావేశమయ్యారు. వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని, కాలువల్లో పూడిక తీయాలని, చెట్లు కూలితే త్వరగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇక్కడ కార్పొరేటర్లను సమావేశానికి పిలవలేదంటూ టీడీపీ కార్పొరేటర్ బాబా ఫక్రుద్దీన్ మండిపడ్డారు. కొందరికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు.

ముందస్తు చర్యలుండవా...?

వర్షాల సీజన్ జూన్‌లో మొదలవుతుందని తెలుసు. కానీ ముందస్తు చర్యలు తీసుకోలేకపోయారు. కాలువల్లో పూడికలు తీయించరు. పెద్ద కాలువలైన మరువవంక, నడిమివంకల్లో పూడికతీత పనులు చేపట్టలేదు. వరదలు వచ్చిన నడిమివంకకు ప్రహరీ నిర్మించలేకపోయారు. పారిశుధ్యం విభాగం అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు సైతం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. రోడ్లలో నీరు నిలబడటానికి ప్రధాన కారణం ఇంజనీర్లు చేసిన తప్పులే. పారిశుధ్య విభాగం అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఈ విషయంలో ఇటు ఉన్నతాధికారులు... అటు పాలకవర్గం ఏమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేశావ్..?

- దౌర్జన్యాలతో నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశావ్
- మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిపై టీడీపీ కన్వీనర్ల ఆగ్రహం



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ కన్వీనర్లు

రాప్తాడు, జూన్ 7: ' మా ప్రభుత్వం ఏర్పడక ముందే... ఆరు నెలల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నావ్... గత ఎన్నికల ముందు నీవు ఇచ్చిన హామీలను అధికారంలో ఉన్న ఐదేళ్లలో చేశావా.. అరాచకాలు.. దోపిడీలు.. దౌర్జన్యాలతో నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశావ్.. అభివృద్ధి గురించి మాట్లాడే అర్హత కూడా నీకు లేదు.' అని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై టీడీపీ కన్వీనర్లు ధ్వజమెత్తారు. నగరంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో ఆరు మండలాల కన్వీనర్లు పంపు కొండప్ప, జింకా సూర్యనారాయణ, శ్రీనివాసులు, పోతులయ్య, సుధాకర్, ముత్యాలరెడ్డి శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ప్రకాష్‌రెడ్డి చేసిన వాఖ్యలపై విరుచుకుపడ్డారు. 'గ్రామాల్లో ప్రజలకు తాగునీటి కోసం ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్లను మూసివేయించావ్.. ఇదేనా నీవు చేసిన అభివృద్ధి.. గ్రామాల్లో వందలాది మంది టీడీపీ కార్యకర్తలపై దాడులు చేయించావు. వాటిని మర్చిపోయావా. ఆ రోజుల్లో పోలీసులకు ఫిర్యాదు చేసినా... కోర్టులకు వెళ్లినా మీరు దాడులు చేశారు. ఇవాళ అక్కడక్కడా జరుగుతున్న సంఘటనలను పరిటాల కుటుంబానికి ఆపాదించడం న్యాయమేనా.? ఎన్నికల ముందు నుంచి నేటి వరకూ ఎవరూ ఎక్కడా సంయమనం కోల్పోవద్దని ఎవరైనా రెచ్చగొట్టినా శాంతి యుతంగా ఉండాలని పరిటాల సునీత చెబుతూనే ఉన్నారు. ఇలాంటి మాట మీరు ఐదేళ్లలో ఏనాడైనా.. ఎక్కడైనా అన్నారా..? ఏ రోజైనా నువ్వు కనీసం మీ కార్యకర్తలనైనా పట్టించుకున్నారా. కనీసం నీ సొంత గ్రామానికి కూడా రోడ్డు వేయించుకోలేని దద్దమ్మవు నీవు... నువ్వా అభివృద్ధి గురించి మాట్లాడేది..? మీ ఎమ్మెల్యేలంతా రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరలా చేశారు. ఇక నుంచి మీ సోదరులు గతంలోలాగా ఇష్టానుసారం మాట్లాడితే ఊరుకునేది లేదు. జాగ్రత్తగా ఉండు.' అని హెచ్చరించారు.

మాటతప్పడం వెన్నతో పెట్టిన విద్య

తోపుదుర్తిపై తెలుగు మహిళల ఫైర్



విలేకరులతో మాట్లాడుతున్న తెలుగుమహిళలు

చెన్నేకొత్తపల్లి, జూన్ 7: మాట తప్పడం.. మడమ తిప్పడం మాజీ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డికి వెన్నతో పెట్టిన విద్య అని తెలుగు మహిళా సత్యసాయి జిల్లా ప్రధాన కార్యదర్శి రామసుబ్బమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో పలువురు తెలుగు మహిళలతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. రాప్తాడులో పరిటాల సునీత గెలిస్తే మీసం తీయించుకుంటానని కొన్ని రోజుల క్రితం ఓ చానల్ ఇంటర్వ్యూలో మాట్లాడిన తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి మాట మీద నిలబడాలని డిమాండ్ చేశారు. కూటమి గెలిచాక రాప్తాడు నియోజకవర్గంలో టీడీపీ దాడులు చేస్తోందని ప్రకాశ్‌రెడ్డి ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. 2019నుంచి ఇప్పటి దాకా తోపు సోదరులు చేసిన దాడులు, దౌర్జన్యాలు గుర్తుకు రావడంలేదా అని ప్రశ్నించారు. మీ సొంత మండలం ఆత్మకూరులో ఓ మహిళ జుట్టు కోసిన సంఘటన మర్చిపోయారని ప్రశ్నించారు. సమావేశంలో తెలుగు మహిళలు వరలక్ష్మీ, సావిత్రి, విజయ, నాగేశ్వరి, అస్మత్‌బీ, లక్ష్మీనరసమ్మ పాల్గొన్నారు.

వాటర్ ప్లాంట్లను వినియోగంలోకి తెస్తాం



వాటర్ ప్లాంట్ పరికరాలను పరిశీలిస్తున్న ధర్మవరపు మురళి, టీడీపీ నాయకులు

రాప్తాడు, జూన్ 7: పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్లను వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు బలవంతంగా మూసివేయించిందని, వాటన్నింటిని మళ్లీ వినియోగంతోకి తెస్తామని టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. రాప్తాడులోని వాటర్ ప్లాంట్‌ను శుక్రవారం టీడీపీ నాయకులతో కలిసి పరిశీలించిన ఆయన మాట్లాడారు. పరిటాల సునీత మంత్రిగా ఉన్నప్పుడు ప్రతి గ్రామంలో ప్రజలకు సురక్షిత నీరు అందించేందుకు వాటర్‌ప్లాంట్లను ఏర్పాటు చేయించారన్నారు. 2019లో వైసీపీ నాయకలు ఆ ప్లాంట్‌లను మూసి వేయించి ప్రజలకు సురక్షిత నీరు దక్కకుండా చేశారన్నారు. ప్రస్తుతం ఆ వాటర్‌ప్లాంట్లు అన్నింటికీ మరమ్మత్తులు చేయించి ప్రజలకు సురక్షిత నీరు అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచ్ తిరుపాలు, గోనిపట్ల శీనా, సాకేజయరాముడు, నారాయణస్వామి, బీరన్న, కిష్టా, అనిల్, లక్ష్మన్న, తెలుగు యువత మండలాధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

రూ. 50 లక్షల ప్రజాధనం వృథా

శింగనమలలో నిరుపయోగంగా భవనం



నిరుపయోగంగా ఉన్న భవనం

శింగనమల, జూన్ 7: శింగనమలలో రూ. 50 లక్షలతో బాలికల వసతి గృహం కోసం 30 రూములున్న భవనాన్ని 2009లో నిర్మించారు. ఆ వసతి గృహంలో తగినంత విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో అనంతపురంలోని వసతి గృహంలో విలీనం చేశారు. దీంతో శింగనమలలో నిర్మించిన భవనం నాటి నుంచి నిరుపయోగంగా ఉంది. కనీసం ఆ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలను నిర్వహించేలా గత పాలకులు, అధికా రులు చొరవ చూపకపోవడంతో నేడు అది శిథిలావస్థకు చేరుకుంది. రాత్రి వేళల్లో ఆ భవనం అసాంఘిక కార్యాకలాపాలకు నిలయంగా మారింది. ఇప్పటికైన నూతన పాలకులు, అధికారులు ఆ భవనంలో ప్రభుత్వ కార్యాలయాలు నిర్వహించి.. ఉపయోగంలోకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆర్టీసీ బస్టాండులోని దుకాణాలపై దాడులు



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కేసు నమోదు చేస్తున్న అధికారులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూన్ 7: స్థానిక ఆర్టీసీ బస్టాండులోని దుకాణాలను తూనికలు, కొలతల శాఖాధికారులు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ దుకాణాల్లో కూల్‌డ్రింక్స్, తినుబండారాలను అధిక ధరలకు అమ్ముతున్నారని ఆంధ్రజ్యోతిలో ప్రచురించిన 'అంతా..మోసం' కథనానికి అధికారులు స్పందించి ఈ తనిఖీలు చేపట్టారు. తూనికలు, కొలతలశాఖ అసిస్టెంట్ కంట్రోలర్ సుధాకర్, ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ గౌస్ ఆధ్వర్యంలో ఈ దాడులు నిర్వహించారు. ఈ దుకాణాలలో కూల్‌డ్రింక్స్, బిస్కెట్ ప్యాకెట్లు, తినుబండారాలను అధిక ధరలకు విక్రయిస్తుండటాన్ని గుర్తించి షాపు యజమానులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మార్పీ ధరలకంటే అదనంగా రూ. 5 లు విక్రయిస్తున్న నాలుగు దుకాణాలపై కేసులు నమోదు చేశారు. అనంతరం బస్టాండులోని దుకాణాదారులకు తూనికలు, కొలతల శాఖ చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీలలో సీనియర్ టెక్నికల్ అసిస్టెంట్ పి. శ్రీనివాసులు, టెక్నికల్ అసిస్టెంట్లు అక్రమ్, మహమ్మద్, సిబ్బంది విశ్వనాథ్ పాల్గొన్నారు.

కళాశాలలపై చర్యలు తీసుకోండి



ఆర్ఐఓకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతపురం విద్య, జూన్ 7: జిల్లాలో కమర్షియల్ బిల్డింగ్స్‌లో నిర్వహిస్తున్న పలు కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (పీఎస్ఎఫ్ఐ), ప్రొగ్రెసివ్ స్టూడెంట్స్ యూనియన్ (పీఎస్‌యూ) నాయకులు ఆర్ఐఓ వెంకటరమణను కోరారు. ఈ మేరకు శుక్రవారం పీఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అబ్దుల్ ఆలం, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మంజుల నరేంద్ర, ఇతర నాయకులు ఆర్ఐఓకు వినిత పత్రం అందజేసి మాట్లాడారు. కమర్షియల్ భవనాలు, రేకుల షెడ్లలో సైతం ఎలాంటి వసతులూ కల్పించకుండానే తరగతులను నిర్వహిస్తూ విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు జగదీష్, మోనా, హరీష్, అనిల్ పాల్గొన్నారు.

ఎస్పీ తనిఖీ



ఎస్ఐతో మాట్లాడుతున్న ఎస్పీ

గార్లదిన్నె : స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ గౌతమి శాలి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎస్ఐ మహమ్మద్ గౌస్‌తో మండల పరిస్థితులపై ఆరా తీశారు. పల్లెల్లో ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని ఎస్ఐకు సూచించారు.

ఎస్కేయూ సీఈగా డాక్టర్ లోకేష్



లోకేష్‌కు ఉత్తర్వులు అందజేస్తున్న వీసీ

అనంతపురం సెంట్రల్, జూన్ 7: ఎస్కేయూ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ (ఈసీ)గా డాక్టర్ లోకేష్ నియమితులయ్యారు. ఈమేరకు శుక్రవారం వీసీ హుస్సేన్‌రెడ్డి ఆదేశాలతో రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య ఉత్తర్వులు జారీచేశారు. ఎస్కే యూలో 1987-89 బ్యాచ్ ఎంకామ్ పూర్తిచేసిన లోకేష్. 1989న అదే వర్సిటిలో క్లర్క్‌గా ఉద్యోగం సాధించాడు. బాధ్యత లు చేపట్టిన లోకేష్‌కు అధికారులు మద్దిలేటి, తిమ్మప్ప, సుధాకర్ నాయుడు, రమేష్, వెంకటరామడు, సుదర్శన్, పెద్దన్న, లక్ష్మణరావు, ఉమాశంకర్ అభినందనలు తెలిపారు.

రేపటి పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయండి

అనంతపురం కల్చరల్, జూన్ 7: ఏపీ అభ్యుదయ రచయితల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించనున్న పుస్తకావిష్కరణ సభను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నానీల నాగేంద్ర శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కవి మర్తాటి ఈశ్వరీ గోపాలరావు రచించిన రైతు మా రాజు' పుస్తకాన్ని కేంద్ర సాహిత్య అకాడమీ సాధారణ మండలి సభ్యుడు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, డాక్టర్ శాంతినారాయణ, సీనియర్ కవులు ఏలూరి యంగన్న, తూముచెర్ల రాజారాం, సి.రాము ఆవిష్కరిస్తారన్నారు.

ఇన్‌చార్జి జీసీడీఓగా షమ బాధ్యతల స్వీకరణ

అనంతపురం విద్య, జూన్ 7 : కేజీబీవీల పర్యవేక్షణ చేసే గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ (జీసీడీఓ)గా షమ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఇటీవల ఇక్కడ జీసీడీఓగా పనిచేస్తున్న మహేశ్వరి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో అసిస్టెంట్ ఐఈడీగా పనిచేస్తున్న షమను ఇన్‌చార్జ్‌గా నియమించారు. దీంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ఆమె జీసీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు. ఈ మేరకు ఆమె ఏపీసీ వైఖోం నిదియాదేవిని మర్యాదపూర్వకంగా కలిశారు.

రాయితీతో కంది విత్తనాల పంపిణీ

శింగనమ జూన్ 7: రైతులకు రాయితీతో కంది విత్తనాలను సోమవారం నుంచి పంపిణీ చేస్తామని ఏవో అన్వేష్‌కుమార్ తెలిపారు. నాలుగు కేజీలు కందులు రూ.392తో అందజేస్తామన్నారు.

విత్తన వేరుశనగ..

అనంతపురం అర్బన్, జూన్ 7: జిల్లాలోని ఆర్బీకేల్లో 13వ రోజైన శుక్రవారమూ విత్తన వేరుశనగ పంపిణీ కొనసాగింది. ఇప్పటి దాకా 63,756 మంది రైతులకు 59,533 క్వింటాళ్లు పంపిణీ చేశారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఇప్పటి దాకా 78,251 మంది రైతులు 69,086 క్వింటాళ్ల విత్తన వేరుశనగ కోసం తమ పేర్లు నమోదు చేసుకున్నారు.

నివాసాల నడుమ మురుగు



అనంతపురం క్లాక్‌టవర్ : హౌసింగ్‌బోర్డు కాలనీ.. పవన్‌గ్యాస్ వెనుక రాజీవ్ చిల్డ్రన్స్ పార్కు సమీపంలో వర్షం కురిసిందంటే..ఇక వీధులన్నీ చిత్తడే. పైగా మురుగు కాలవల్లో చెత్త పేరుకుపోవడంతో మురుగు నీరంతా రోడ్డుపైకి చేరి ఇళ్లలోకి వస్తోంది. దోమల బెడద.. దుర్వా సనతో స్థానికులు రోగాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికా రులు స్పందించి కాలవలను శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టీడీపీ నాయకులను చితకబాదిన పోలీసులు





ధ్వంసమైన శిలాఫలకం... టీడీపీ నాయకుడు తిరుపాలు

శింగనమల, జూన్ 7: సలకంచెరువు సచివాలయంలో వైఎస్ జగన్ ఫొటోతో ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశారంటూ నలుగురు టీడీపీ నాయకులను పోలీసులు చితకబాదారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు అంజన్ రెడ్డి, జింకల బాషా శుక్రవారం రాత్రి గ్రామానికి వెళ్లారు. మాజీ సర్పంచ్ కుమారుడు తిరుపాలు, మాజీ ఎంపీటీసీ భర్త భయన్న, కేశవ, రాంమోహన్‌ను చితకబాదుతూ పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లారు. దీంతో పోలీస్ స్టేషన్ వద్ద టీడీపీ నాయకులు ఆందోళనకు దిగారు. డీఎస్పీ వెంకట శివారెడ్డి, సీఐ శ్రీధర్ అక్కడికి చేరుకుని టీడీపీ నాయకులకు సర్దిచెప్పారు. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కాగా, సచివాలయంలో శిలాఫలకాన్ని ధ్వంసం చేసినా ఎందుకు ఫిర్యాదు చేయలేదని రెవెన్యూ అధికారిపై ఎస్ఐ ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే ఫిర్యాదు చేయాలని ఒత్తిడి చేశారు.

హింసకు పాల్పడితే రౌడీషీట్ ఓపెన్ చేస్తాం



గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి శాలి

●జిల్లా ఎస్పీ గౌతమిశాలి

యాడికి, జూన్7: హింసాత్మక ఘటనలకు పాల్పడే వారిపై రౌడీ షీట్ ఓపెన్ చేస్తామని జిల్లా ఎస్పీ గౌతమిశాలి హెచ్చరించారు. మండలంలోని వెంగన్నపల్లి, పుప్పాల గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. గ్రామస్థులతో మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు శాంతియుత జీవనం గడపాలన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే ఎంతటివారినైనా ఉపేక్షించమని హెచ్చరించారు. ఆమె వెంట సీఐ నాగార్జునరెడ్డి, సిబ్బంది ఉన్నారు.

పామిడి: ప్రజల ప్రశాంతతకు విఘాతం కల్గిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించవద్దని జిల్లా ఎస్పీ గౌతమి శాలి ఎస్ఐ రాజును ఆదేశించారు. పామిడి పోలీసు స్టేషన్‌ను శుక్రవారం సాయంత్రం ఎస్పీ తనిఖీ చేశారు. మండలంలోని శాంతిభద్రతలపై ఎస్ఐ రాజును అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడెక్కడ ఘర్షణలు జరిగాయని అడిగారు. ఎక్కడా ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోలేదనడంతో సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తక పఠనం అవసరం: ఎంఈఓలు

పామిడి, జూన్ 7: విద్యార్థి దశలో పుస్తక పఠనం ఎంతో అవసరమని ఎంఈఓలు జయానాయక్, సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో మే 15 నుంచి జూన్ 7వ తేదీ వరకూ వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. సమ్మర్ క్యాంప్ ముగియడంతో వివిధ పోటీలలో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు రమేష్, శివప్రసాద్, గ్రంథాలయాధికారిణి విజయలక్ష్మి, బీడీసీ లక్ష్మికాంతరెడ్డి, టీవీ మెకానిక్ గాదిలింగప్ప పాల్గొన్నారు.

మురుగు కాలువలో పూడిక తీయాలి

గుంతకల్లు టౌన్, జూన్ 7: పట్టణంలోని మురుగు కాలువలో పూడిక పనులు చేపట్టాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీర్ గుర్రప్పయాదవ్‌కు శుక్రవారం సీపీఎం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలో చిన్నపాటి వర్షానికి కాలువలకు దిగువకు ఉన్న ఇళ్లలోకి మురుగునీరు చేరుతోందన్నారు. కాలువలో పేరుకుపోయిన పూడిక తొలగింపు పనులను వెంటనే చేపట్టి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో సీపీఎం పట్టణ కార్యదర్శి బీ శ్రీనివాసులు, నాయకులు దాసరి శ్రీనివాసులు, కసాపురం రమేష్, సాకేనాగరాజు, తిమ్మప్ప, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి కూలిన వంతెన సమస్య



గంగలాపురం వంతెనను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

కణేకల్లు, జూన్ 7: మండల కేంద్రంలోని చిక్కణ్ణేశ్వర వడియార్ చెరువుకు అనుసంధానంగా ఉంటూ కూలిన గంగలాపురం వంతెన సమస్యను నూతన ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లనున్నట్లు టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శుక్రవారం మండల టీడీపీ నాయకులు కల్వర్టును పరిశీలించి హెచ్చెల్సీ అధికారులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, ఆది, కోళకుర్తి సుదర్శన్, బసవరాజు, బీటీ రమేష్, చాంద్‌బాషా, షేక్‌ముజ్జు, కురుబ నాగరాజు, మాబుసాబ్, చిన్నసలీం, వరుణ్, ప్రకాష్, నాగభూషణం, జయశీలారెడ్డితో పాటు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇది బడుగుల విజయం: జనసేన

పామిడి, జూన్ 7 : గుంతకల్లు నియోజకవర్గంలో ఎన్డీయే కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం గెలుపు బడుగుల విజయమని జనసేన మండల అధ్యక్షుడు ధనుంజయ పేర్కొన్నారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఎన్డీయే కూటమి ఘన విజయంపై ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్కువ సమయంలోనే ప్రజల నుంచి ప్రేమాభిమానాలు పొంది విజయం సాధించడం గుమ్మనూరు జయరాంకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జగదీష్, వేణుగోపాల్, రాము, లాలు స్వామి, పెన్న ఓబులేసు, మురళి, షేక్షావలి, శ్రీనివాసులు, ఖాజావలి, రోషన్, జమీర్, సిద్ధరాజు, నబిరసూల్, సల్మాన్, అఫ్జల్, రమేష్, పవన్ పాల్గొన్నారు.

రూ.2లక్షలు, మూడు కేజీల వెండి చోరీ



ఇంటిలో మంచంపై చెల్లాచెదురుగా పడి ఉన్న దుస్తులు, సామగ్రి

తాడిపత్రిటౌన్, జూన్7: పట్టణ సమీపంలోని కడపరోడ్డు ఐశ్వర్యవిల్లాస్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ ఇంటిలో గురువారం అర్ధరాత్రి దొంగలు పడి రూ.2లక్షలు, మూడుకేజీల వెండిని చోరీ చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. వారు తెలిపిన మేరకు సుధాకర్ గ్రానైట్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. ఈయనకు ఆరోగ్యం బాగా లేకపోవడంతో ఐదురోజులక్రితం ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి చికిత్స కోసం హైదరాబాద్‌కు వెళ్లాడు. ఇంటిలో ఎవరూ లేరని గమనించిన దొంగలు తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న నగదు, వెండిని అపహరించుకు పోయారని తెలిపారు. సమాచారం అందుకున్న సుధాకర్ బంధువులు ఇంటికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. సంఘటానికి చేరుకున్న పోలీసులు దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. క్లూస్‌టీం ద్వారా ఆధారాలను సేకరించే పనిలో పడ్డారు. దొంగలు ఐశ్వర్య విల్లాస్ సమీపంలో ఉన్న మైల్యాండ్ బ్యాంక్ కాలనీలో నివాసం ఉంటున్న ప్రకాష్ ఇంటిలో చోరీకి ప్రయత్నిస్తుండగా పక్కింటి వారు కేకలు వేయడంతో పారిపోయారు. ప్రకాష్ ఆర్టీసీలో పని చేస్తున్నాడు. ఈయన కూడా కాలు సరిగా లేకపోవడంతో హైదరాబాద్‌కు వెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

ఆలయాల్లో టీడీపీ నాయకుల పూజలు



దేవాలయం వద్ద టెంకాయలు కొడుతున్న టీడీపీ నాయకులు

గుత్తిరూరల్,జూన్ 7: రాష్ట్రంలో ఇటీవల జరిగిన సార్వత్రి ఎన్నికల్లో టీడీపీ విజయం సాధించడంపై ఆపార్టీ నాయకులు ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని తొండపాడు, బొలికొండ రంగనాథ స్వామి, బాట సుంకులమ్మ దేవాలయాల్లో టీడీపీ నాయకులు, , కార్యకర్తలు 101 టెంకాయలు కొట్టి మొక్కులు చెల్లించారు.

బాధ్యతగా పని చేయండి: కలెక్టర్



కలెక్టరుకు వినతిపత్రం ఇస్తున్న టీడీపీ నాయకులు

బెళుగుప్ప, జూన్ 7: కార్యాలయ అధికారులు బాధ్యతాయుతంగా విధులు నిర్వహించకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టరు వినోద్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని జీడిపల్లి రిజర్వాయరును పరిశీలించిన అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. కార్యాలయంలో సిబ్బంది కనిపించకపోవడంతో మండిపడ్డారు. హాజరు పట్టికను తనిఖీ చేయాలని ఆర్డీవో రాణి సుష్మితకు సూచించారు. ఏ అధికారి హాజరు కాలేదు. సెలవుపై వెళ్లి ఉంటే సెలవు లెటరు ఇచ్చారా లేదన్నది పరిశీలించాలని ఆర్డీవోను ఆదేశించారు. విధులకు డుమ్మాకొడుతూ బాధ్యత లేకుండా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది ఎక్కడున్నారు, ఏమి చేస్తున్నారు పరిశీలిస్తూ వుండాలని డీటీ హుస్సేన్ పీరాకు సూచించారు. విలేకరులతో మాట్లాడుతూ రిజర్వాయర్లో వర్షపునీరు మాత్రమే చేరిందన్నారు. నీటి సామర్థ్యం ఆర్ అండ్ ఆర్ సమాచారం తెలుసుకున్నాం. ఇక నుంచి ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో పట్ల అప్రమత్తంగా ఉంటూ వివరాలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియ జేసేలా చర్యలు తీసుకోవాలని హంద్రీనీవా అధికారులకు సూచించిన ట్లు తెలిపారు.

శ్మశానవాటిక సమస్య పరిష్కరించాలని వినతి

బెళుగుప్పలో శ్మశానవాటిక సమస్యతో గ్రామస్థులు ఇబ్బంది పడుతున్నారని సమస్యను పరిష్కరించాలంటూ టీడీపీ జిల్లా ఉపాధ్యక్షులు పెద్ద తిప్పయ్య, జిల్లా కార్యదర్శి మల్లికార్జున, త్రివేదినాయుడు, సుధీర్‌లు కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందించారు. పరిశీలించి నివేదిక పంపాలని ఆర్డీవో రాణి సుష్మితను ఆదేశించారు.

● ఆవులెన్న గ్రామానికి రోడ్డు సౌకర్యం లేక ఇబ్బందిపడుతున్నాం. సమస్యను పరిష్కరించాలంటూ సర్పంచ్ రాము, కలెక్టర్ వినోద్ కుమార్‌కు వినతిపత్రం ఇచ్చారు. నిధులు మంజూరు చేయాలని కోరగా పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టరు తెలిపారు.

కొనసాగుతున్న టీడీపీ నాయకుల సంబరాలు



కణేకల్లులో కొబ్బరికాయలు కొడుతున్న టీడీపీ నాయకులు



విలేకర్లతో మాట్లాడుతున్న నాయీ బ్రహ్మణ సంఘం నాయకులు

కణేకల్లు, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ అఖండ మెజార్టీ సాధించడంతో ఆ పార్టీ శ్రేణుల సంబరాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల వ్యాప్తంగా ఉన్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు చిక్కణ్ణేశ్వర దేవాలయం చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే 101 కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. అక్కడ నుండి ర్యాలీగా టీడీపీ జెండా కట్ట వద్దకు చేరుకుని జెండా ఎగురవేసి టపాసులు పేల్చుతూ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లాలెప్ప, ఆనంద్‌రాజ్, వేలూరు మరియప్ప, ఆది, కోళకుర్తి సుదర్శన్, బీటీ రమేష్, షేక్‌ముజ్జు, వన్నారెడ్డి, బసవరాజు, అనిల్, కురుబ నాగరాజు, వెంకటేశులు, మాబుసాబ్, రుద్రముని, చాంద్‌బాషా, ఎంసీ సర్మాస్, శరభనగౌడ్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల నాయీబ్రహ్మణుల సంఘం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం కూడేరులో వారు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా కడదరకుంట నాగరాజు మాట్లాడుతూ కుల వృత్తులతో జీవనం సాగిస్తున్న నాయీబ్రహ్మణులకు అన్ని విధాలుగా కూటమి అండగా ఉంటుందన్నారు. సమావేశంలో ఆయనతోపాటు ప్రసాద్, వెంకటరమణ, సుబ్బరాయుడు, చందు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

పుట్లూరు, జూన్7: స్థానిక ఆదర్శపాఠశాలలో 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి 7, 8, 9 తరగతులకు మిగులు సీట్లలో చేరగోరువారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ ఓబుల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని జూన్ 12లోపు పాఠశాలలో పత్రాలు ఇవ్వాలన్నారు. 13న జరిగే ప్రవేశపరీక్షకు హాజరుకావాలని సూచించారు. 8, 9 తరగతులకు సీబీఎస్ఈ సిలబస్ ప్రకారం బోధన ఉంటుందని ఆయన తెలిపారు.

మద్యం సీజ్.. ఒకరిపై కేసు

పామిడి, జూన్ 7 : మండలంలోని కండ్లపల్లి గ్రామంలో లిక్కర్ సీజ్ చేసినట్లు సీఐ రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. కండ్లపల్లిలో అక్రమంగా లిక్కర్ నిల్వ చేసి విక్రయిస్తున్న బెల్ట్ షాపు నిర్వహకుడు మల్లికార్జునపై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మల్లికార్జున నుంచి 22 క్వార్టర్ లిక్కర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెల్లడించారు.

ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలలిత

కూడేరు, జూన్ 7: మండల ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా విజయలలిత బాధ్యతలు స్వీకరించారు. కూడేరు ఎంపీడీఓగా పనిచేసిన కెఎండీ బాషా ఉద్యోగ విరమణ చేయడంతో ఉన్నతాధికారులు వజ్రకరూరు మండల ఎంపీడీఓగా పని చేస్తున్న విజయలలితకు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. బాధ్యతలు స్వీకరించిన ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సాయం

బ్రహ్మసముద్రం, జూన్ 7: మండల కేంద్రానికి చెందిన టీడీపీ కార్యకర్త లింగమయ్య రోడ్డు ప్రమాదంలో గాయపడి అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతుండటంతో ఆయన కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు రూ. పది వేలు ఆర్థిక సాయం పంపారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి టీడీపీ కార్యకర్త చికిత్స పొందుతున్నాడన్న సమాచారం తెలుసుకున్న ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ద్వారా ఆర్థిక సాయం అందజేశారు. పార్టీ కార్యకర్త కుటుంబానికి ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

దోమకాటుతోనే మలేరియా వ్యాప్తి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది

యాడికి, జూన్7: దోమకాటుతోనే మలేరియా వ్యాప్తి చెందుతుందని, దోమకాటు నుంచి రక్షించుకోవడానికి జాగ్రత్తలు పాటించాలని రాయలచెరువు ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం డాక్టర్ దేవరాజన్ తెలిపారు. మలేరియా వ్యతిరేక మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం మండలంలోని నగరూరు గ్రామంలో మలేరియా నివారణపై ఆరోగ్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 1నుంచి 30వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. మలేరియా రహిత సమాజం ఏర్పాటులో ప్రజలంతా భాగస్వాములు కావాలని ఆయన సూచించారు. ర్యాలీలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ షబ్బీర్, ఆరోగ్యసిబ్బంది దాసు, సుజాత పాల్గొన్నారు.

ఉరవకొండ: సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాచర్ల తండాలో శుక్రవారం మలేరియా నివారణ మాసోత్సవాలలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి జ్వరాలపైన అవగాహన కల్పించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. మురుగునీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. అలాగే ప్రభుత్వాసుపత్రిలో మలేరియా సబ్‌యూనిట్ కార్యాలయాన్ని జిల్లా మలేరియా అధికారి సత్యనారాయణ తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో గోవిందు, వైద్య సిబ్బంది ప్రసాద్, నాగరాజు పాల్గొన్నారు.

వైవీఆర్ మీసం తీయించుకో



సమావేశంలో మాట్లాడుతున్న గుమ్మనూరు నారాయణ

గుత్తి, జూన్ 7: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గెలిస్తే మీసం తీయించుకుంటానని చాలెంజ్ చేసిన మాజీ ఎమ్మెల్యే వెంకటరామిరెడ్డి ఆ సవాల్‌కు సిద్ధమేనా అని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్‌బీలో శుక్రవారం ఆయన టీడీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటరామిరెడ్డి..! నిన్ను ఓడించడానికి చంద్రబాబు అవసరం లేదు, గుమ్మనూరు జయరాం చాలు అన్నారు. కేవలం ఒక ఎమ్మెల్యేగా ఉంటూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబును నోటికి వచ్చినట్లు మాట్లాడావు. నీకేమైనా సంస్కారం ఉందా అని మండిపడ్డారు. చంద్ర నీవు విసిరిన చాలెంజ్‌కు కట్టుబడి ఉంటే సొంతంగా మీసాలు తీయించుకో లేకపోతే తన సొంత డబ్బులతో క్షురకులను పంపిస్తా అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు రవితేజ, నారాయణ స్వామి, ఎంకే చౌదరి, దిల్కాశీనా, న్యాయవాది సోమశేఖర్, గోవిందు, ప్రతాప్, అబ్దుల్ వహబ్, కృష్ణయ్య, బద్రివలి తదితరులు పాల్గొన్నారు.

గుత్తిఆర్ఎస్‌లో టీడీపీ విజయోత్సవ ర్యాలీ

గుంతకల్లు నియోజకవర్గం టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఘన విజయం సాధించడంతో గుత్తి ఆర్ఎస్‌లో టీడీపీ విజయోత్సవ ర్యాలీని గుమ్మనూరు నారాయణ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ ర్యాలీ చంద్రప్రియ నగర్ నుంచి పత్తికొండ రోడ్డు, జ్యోతిరావు పూలే సర్కిల్, మొయిన్ బజార్, రైల్వే అర్చ్ వరకు భారీ ఎత్తున ర్యాలీ కొనసాగింది. అనంతరం రైల్వే ఆర్చ్ వద్ద కేక్‌ను కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

వేతనాలు చెల్లిస్తేనే పని చేస్తాం: కార్మికులు



సమ్మె చేస్తున్న కార్మికులతో చర్చిస్తున్న డీఈ సఫ్రిన్



ఎద్దుల బండిలో తాగు నీరు తీసుకెళ్తున్న వేల్పుమడుగు గ్రామస్థులు

విడపనకల్లు, జూన్ 7: మండల కేంద్రంలో సీపీ డబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మె రెండో రోజు కొనసాగింది. సమ్మె విరమించాలని వేతనాలు ఇప్పించే ఏర్పాట్లు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కార్మికులతో జరిపిన చర్చలు విఫలం అయ్యాయి. ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ సఫ్రిన్, ఏఈ ధనుంజయ్య శుక్రవారం ఉదయం విడపనకల్లులోని కార్మికుల సమ్మె వద్దకు మాట్లాడారు. వేతనాలు విషయం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లి న్యాయం చేస్తామన్నారు. కాంట్రాక్టర్‌తోను చర్చించి వేతనాలు ఇచ్చే ఏర్పాట్లు చేస్తామన్నారు. సమ్మె చేయటం వల్ల 9 గ్రామాల ప్రజలు తాగు నీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతారని విరమించాలని కోరారు. కార్మికులు మాట్లాడుతూ కాంట్రాక్టర్ సీపీ డబ్ల్యూఎస్ కార్మికులకు ఆరు నెలలు అయినా వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నాడు అన్నారు. వేతనాలు మా అకౌంట్లోకి పడితేనే విధులకు వెళ్తాము లేకపోతే సమ్మెను విరమించేది లేదన్నారు. తాగునీరు బంద్ కావటంతో వివిధ గ్రామాల ప్రజలు ఎద్దుల బండ్లలో విడపనకల్లులోని ఎస్ఎస్ ట్యాంక్‌కు(మంచినీటి చెరువు) వచ్చి తాగునీటిని తీసుకెళ్తున్నారు. కార్మికుల సమ్మెతో మండలంలో తాగు నీటి కష్టాలు మొదలైయ్యాయి.

ఘనంగా టీడీపీ విజయోత్సవ సంబరాలు



ఎన్టీఆర్ విగ్రహం వద్ద సంబరాలు చేసుకుంటున్న టీడీపీ శ్రేణులు

బెళుగుప్ప, జూన్ 7: ఎన్నికలలో కూటమి గెలుపుతో శుక్రవారం స్థానిక ఎన్టీఆర్ విగ్రహం వద్ద బాణసంచా కాల్చి టీడీపీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. ఎన్నికల కోడ్ ముగియడంతో విగ్రహానికి ముసుగు తొలగించారు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన ఎన్టీఆర్ ఆశయసాధనకు పాటుపడదామంటూ నాయకులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

24.2 మిల్లీ మీటర్ల వర్షపాతం



వర్షపునీటికి మునిగిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు

బెళుగుప్ప, జూన్ 7: మండలంలో గురువారం రాత్రి 24.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. దీంతో చెరువులకు జలకళ సంతరించుకుంది. అంకంపల్లిలో రైతు వెంకటేశులుకు చెందిన నాలుగు ఎకరాలలో వేరుశనగ పంట నీటమునిగింది. రూ. లక్షకు పైగా పంట నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. శుక్రవారం కూడా వర్షం కురవడంతో మండలంలోని అన్ని చెరువులకు 40 శాతం నీరు చేరింది.

సీజనల్ వ్యాధులపై అవగాహన



ఉద్దేహాళ్‌లో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

బొమ్మనహాళ్, జూన్ 7: ప్రస్తుతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని బొమ్మనహాళ్ వైద్యసిబ్బంది సూచించారు. శుక్రవారం మండలంలోని ఉద్దేహాళ్ గ్రామంలో సీజనల్ వ్యాధులపై ర్యాలీ నిర్వహించారు. వర్షాలు ఎక్కువగా కురుస్తున్న నేపథ్యంలో మలేరియా, డెంగీ, చికున్‌గున్యా లాంటి వ్యాధులు వ్యాప్తి అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదిస్తే బాగుంటుందని వారు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ నాగమణి, హెల్త్ అసిస్టెంట్లు జైనాబీ, గోవర్ధన్ పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు

బొమ్మనహాళ్, జూన్ 7: గ్రామీణ ప్రాంతాలలో చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కళ్యాణదుర్గం డీఎస్పీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండలంలోని దర్గాహోన్నూరు, దేవగిరి గ్రామాలలో పోలీస్‌పికెట్ పరిశీలించి పోలీస్ మొబైల్ పార్టీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామాలలో అల్లర్లకు పాల్పడకుండా సంయమనంతో శాంతిభద్రతలకు సహకరించాలని డీఎస్పీ సూచించారు. చట్టానికి వ్యతిరేకంగా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు. దేవగిరి గ్రామంలో గ్రామ సచివాలయం సందర్శించి సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. సమస్యాత్మక గ్రామాలలో నిఘా ఉంచాలని సిబ్బందికి సూచించామన్నారు. తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

'చంద్ర' ఆశయ సాధనకు కృషి: సీపీఐ



చంద్ర రాజేశ్వరరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

గుంతకల్లుటౌన్, జూన్ 7: సీపీఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆశయాల సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గోవిందు, గుంతకల్లు నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి పేర్కొన్నారు. పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో శుక్రవారం కామ్రేడ్ చంద్రరాజశ్వేరరావు జయంతిని ఆపార్టీ నాయకులు ఘనంగా నిర్వహించారు. చంద్ర రాజేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ మండల సహాయ కార్యదర్శి రామాంజినేయులు, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి కుల్లాయప్ప, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి ఈశ్వరయ్య, మురళి, పుల్లయ్య, పాల్గొన్నారు.

విజయోత్సవ ర్యాలీకి తరలిరండి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

రాయదుర్గంరూరల్, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో అఖండ మెజార్టీతో రాయదుర్గం ఎమ్మెల్యేగా గెలుపొందిన కాలవ శ్రీనివాసులు మొట్టమొదటి సారిగా రాయదుర్గానికి వస్తున్న నేపథ్యంలో విచ్చేస్తున్న సందర్భంగా విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు వసుపులేటి నాగరాజు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శనివారం ఉదయం 10.30 గంటలకు ఆర్అండ్‌బీ అతిథిగృహం దగ్గర నుండి లక్ష్మీబజార్, వినాయకసర్కిల్ మీదుగా బళ్లారిరోడ్డు, ఎన్‌టీఆర్ విగ్రహం వరకు ఊరేగింపు నిర్వహిస్తున్నామన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

● టీడీపీ విజయోత్సవ ర్యాలీని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ హనుమంతు శుక్రవారం తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు వేపరాలక్రాస్ వద్దకు చేరుకోవాలన్నారు. మండలంలోని సర్పంచులు, మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, మాజీ జడ్పీటీసీలు, టీడీపీ మండల నాయకులు, గ్రామస్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.